క్లుప్తంగా

ధర్మానను కలిసిన పార్టీ రాష్ట్ర జాయింట్ సెక్రటరీ



ధర్మాన ప్రసాదరావును సత్కరిస్తున్న బొడ్డేపల్లి రమేష్‌కుమార్

శ్రీకాకుళం రూరల్: పెదపాడులోని క్యాంప్ కార్యాలయంలో మాజీ మంత్రి ధర్మాన ప్రసాదరావును వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర జాయింట్ సెక్రటరీ, ఆమదాలవలస మాజీ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ బొడ్డేపల్లి రమేష్ కుమార్ మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ధర్మానను దుశ్శాలువతో సత్కరించారు.

ఆదిత్యుని సన్నిధిలో ఎస్టీ కమిషన్ చైర్మన్



శంకరరావుకు జ్ఞాపిక అందజేస్తున్న దృశ్యం

అరసవల్లి: ప్రసిద్ధ పుణ్యక్షేత్రం అరసవల్లి సూర్యనారాయణ స్వామి క్షేత్రం ప్రశాంత నిలయమని రాష్ట్ర ఎస్టీ కమిషన్ చైర్మన్ డాక్టర్ డి.వి.జి.శంకరరావు అన్నారు. మంగళవారం కుటుంబసభ్యులతో కలిసి ఆదిత్యున్ని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా వారికి ఆలయ సంప్రదాయం ప్రకారం ప్రధానార్చకులు ఇప్పిలి శంకరశర్మ పూర్ణకుంభ స్వాగతం పలికి అంతరాలయ దర్శనం చేయించారు. అనంతరం ఆలయ విశిష్టతను వివరించి జ్ఞాపిక అందజేశారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి సూపరింటెండెంట్ వెంకటరమణ, జూనియర్ అసిస్టెంట్ బి.ఎస్.చక్రవర్తి పాల్గొన్నారు.

బీఎల్ఓలకు శిక్షణ



ధ్రువపత్రాలతో బీఎల్ఓలు

శ్రీకాకుళం పాతబస్టాండ్/శ్రీకాకుళం రూరల్: జిల్లా కేంద్రంలోని రెవెన్యూ అతిథి గృహ సమావేశ మందిరంలో మంగళవారం శ్రీకాకుళం నియోజకవర్గ బూత్ లెవెల్ ఆఫీసర్లకు శిక్షణ నిర్వహించారు. ఎన్నికల జాబితా నిర్వహణపై అవగాహన కల్పించారు. అనంతరం ఆన్‌లైన్ పరీక్షలు నిర్వహించి ధ్రువపత్రాలు అందజేశారు.

బదిలీ టీచర్లకు అందని జీతాలు



మాట్లాడుతున్న చిన్నికృష్ణంనాయుడు

రణస్థలం: మండలంలో మరువాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలతో పాటు మరికొన్ని పాఠశాలల ఉపాధ్యాయులకు జూన్ నెల జీతాలు ఇప్పటి వరకు అందలేదని ఆపస్ మండల అధ్యక్షుడు జి.చిన్నికృష్ణంనాయుడు తెలిపారు. రణస్థలంలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ మేలో జరిగిన బదిలీలు తర్వాత ఇప్పటి వరకు జీతాలు అందని వారు వేల సంఖ్యలో ఉన్నారని, ప్రభుత్వం స్పందించి సకాలంలో జీతాలు జమ చేయాలని కోరారు. ఈ విషయమై రణస్థలం ఎంఈవో ఏ.త్రినాథరావు వద్ద ప్రస్తావించగా.. బదిలీ ఉపాధ్యాయులు పొజిషన్ ఐడీలు రాకపోవడం వల్ల జీతాలు పడలేదని, ఇలా 47మంది ఉపాధ్యాయులు ఉన్నారని, మరో మూడు రోజుల్లో ఐడీలు రావచ్చునని తెలిపారు.

పారిశుద్ధ్యంపై అవగాహన

జి.సిగడాం: చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలను సమర్థంగా నిర్వహించాలని ఎంపీడీఓ గుంటముక్కల రామకృష్ణారావు సిబ్బందికి సూచించారు. మంగళవారం పెంట గ్రామంలో పొడి చెత్త, తడి చెత్తపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాతావరణ మార్పుల వల్ల రోగాలు వ్యాప్తి చెందే అవకాశం ఉన్నందున సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ పున్నాన సోనియా, నాయకులు మక్క నారాయణరావు, పున్నాన అక్కలనాయుడు, కార్యదర్శి దుర్గారావు, ఓం మణికంఠ యువజన సంఘం అధ్యక్షులు పాగిరి బోడినాయుడు పాల్గొన్నారు.

ప్రశాంతంగా ఏపీపీఎస్సీ పరీక్షలు



పరీక్ష కేంద్రం వద్ద డీఆర్ఓ

శ్రీకాకుళం పాతబస్టాండ్: ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ వివిధ లెక్చరర్ పోస్టులకు భర్తీకి మంగళవారం నిర్వహించిన పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. 148 మందికి గాను 95 మంది అభ్యర్థులు హాజరయ్యారు. ఈ నెల 23 వరకు పరీక్షలు జరగనున్నాయి. కోర్ టెక్నాలజీస్ సెంటర్ పరీక్షా కేంద్రాన్ని డీఆర్‌వో ఎం.వెంకటేశ్వరరావు సందర్శించారు. అసిస్టెంట్ సెక్రటరీ ఎ.కృష్ణవేణి, సెక్షన్ అధికారి ఎం.అమ్మాజీ తదితరులు పాల్గొన్నారు.

చేప చిక్కక..
బతుకు నావ సాగక!



బందరువానిపేట తీరంలో వేట లేక నిలిచిన పడవలు

- నిరాశజనకంగా చేపల వేట
- అరకొరగా వలకు చిక్కుతున్న మత్స్య సంపద
- సోనా బోట్లు రాకతో భారంగా మారిన వేట

గార: సముద్రంలో చేపల వేట నిరాశాజనకంగా సాగుతోంది. అరకొరగా మత్స్య సంపద లభిస్తుండటంతో మత్స్యకారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికే ఏప్రిల్ 15 నుంచి జూన్ 15 వరకూ వేట విరామం కావడంతో ఇతర పనులు చేసుకుంటూ జీవనం కొనసాగించారు. విరామం ముగిసినా పరిస్థితులు అనుకూలించకపోవడంతో అవస్థలు తప్పడం లేదు. ప్రతికూల వాతావరణం, అలల ఉధృతి ఎక్కువగా ఉండటంతో ఆశించిన మేర చేపలు లభ్యం కావడం లేదు. కష్టపడి కిలోమీటర్లు దూరం ప్రయాణించినా అరకొరగానే లభిస్తున్నాయి. తెల్లవారు జామున వేటకు వెళ్లి గంటలు తరబడి వేచి చూసినా చేపలు చిక్కడం లేదు. ఒక్కో రోజు డీజిల్ డబ్బులు కూడా రాని పరిస్థితి ఉందని మత్స్యకారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

సాగని వేటతో అవస్థలు..

గార మండలంలోని బందరువానిపేట, కె.మత్స్యలేశం, కొమరవానిపేట, మొగదాలపాడు, వత్సవలస, ఎస్.మత్స్యలేశం, బలరాంపురం ప్రాంతాల నుంచి మత్స్యకారులు వేటకు వెళ్తుంటారు. 243 డీజిల్ ఇంజిన్ బోట్లు, 316 కట్టల తెప్పల ద్వారా సుమారు 2600 మంది వేట సాగిస్తున్నారు. డీజిల్ ఇంజిన్ ద్వారా యజమానితో సహా ఆరుగురు, తెప్పల ద్వారా ముగ్గురు వ్యక్తులు వేటకు వెళ్తుంటారు. గతంలో వేటకు వెళ్లిన సమయంలో 100 కేజీల నుంచి 200 కేజీల వరకు చేపల దొరకగా, ప్రస్తుతం 50 కేజీల చేపలు కూడా దొరకని పరిస్థితి. దొరుకుతున్న మత్స్యసంపద ఒక్కోసారి డీజిల్ డబ్బులు కూడా రావడం లేదని చెబుతున్నారు.

సోనాబోట్లుతో దోచేస్తున్నారు...

అరకొరగా లభ్యమవుతున్న మత్స్యసంపదకు తోడు విశాఖపట్నం, కాకినాడ, తమిళనాడు రాష్ట్రం నుంచి సోనాబోట్లతో వచ్చి సంపదను దోచుకుపోతున్నారని మత్స్యకారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తీరం నుంచి 28 కిలోమీటర్లు పైబడి వేట సాగించుకోవచ్చన్న నిబంధనలు ఉన్నా అందుకు విరుద్ధంగా తీరం సమీపంలోకి వచ్చేస్తున్నారని చెబుతున్నారు. సోనాబోట్లులో గిల్ నెట్ వాడటంతో చిన్న చేప నుంచి పెద్ద చేపల వరకు అన్నీ వలకు చిక్కుతాయని, అల్లిక వల, సంప్రదాయ వలలతో వేట సాగించే తమకు చేపలు దొరకడం లేదని ఆవేదన చెందుతున్నారు.

డీజిల్ ఖర్చులూ రావడం లేదు..



సముద్రంలో చేపల వేట బాగా లేదు. ఒక్కోసారి డీజిల్ ఖర్చులు కూడా రాని పరిస్థితి ఉంది. ఆరుగురు వేటకు వెళితే 20 కేజీల చేపలు కూడా దొరికే పరిస్థితి లేదు. సోనా బోట్లు తీరం దగ్గరకు వచ్చి వేట చేయడంతో మాకు చేపలు దొరకడం లేదు.

– పుక్కళ్ల తవిటయ్య, మత్స్యకారుడు, బందరువానిపేట

పాత రోజులు ఎప్పుడొస్తాయో..



గతంలో వేట నిషేధం తర్వాత చేపల వేటకు వెళితే రూ.10 వేలు పైబడి విలువైన చేపలు దొరికేవి. ప్రస్తుతం రూ.3 వేలు కూడా విలువ చేయడం లేదు. ఆషాఢం వంటి నెలల్లో చేపలు ఎక్కువగా దొరకాల్సి ఉన్నా పరిస్థితి అలా లేదు. పాత రోజుల్లో వేటకు వెళితే కిట్టుబాటు అయ్యేది. ఇప్పుడు భారంగా మారింది.

– బర్రి కృష్ణారావు, మత్స్యకారుడు, బందరువానిపేట

రాష్ట్రంలో రెడ్‌బుక్ రాజ్యాంగం



వాండ్రంగిలో కూటమి ప్రభుత్వ మోసాలను వివరిస్తున్న మాజీ ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్, నాయకులు

- ఎచ్చెర్ల మాజీ ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్

జి.సిగడాం: కూటమి ప్రభుత్వం చేస్తున్న మోసాలను ఎండగట్టేందుకే ఇంటింటికీ వెళ్లి 'బాబు ష్యూరిటీ–మోసం గ్యారెంటీ' కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎచ్చెర్ల మాజీ ఎమ్మెల్యే గొర్లె కిరణ్ కుమార్ అన్నారు. మంగళవారం వాండ్రంగి గ్రామంలో జి.సిగడాం మండల పార్టీ అధ్యక్షుడు డోల వెంకటరావు, వైఎస్సార్ సీపీ సీనియర్ నేత ఈసర్ల గోవిందరావు ఆధ్వర్యంలో బాబు ష్యూరిటీ–మోసం గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి కూటమి ప్రభుత్వం మోసాలను వివరించారు. అంతకుముందు కిరణ్ విలేకరులతో మాట్లాడారు. కూటమి ప్రభుత్వాన్ని ఎవరు ప్రశ్నించినా రెడ్‌బుక్ రాజ్యాంగం అమలు చేసి దాడులు, హత్యలు చేయిస్తున్నారని చెప్పారు. కూటమి ప్రభుత్వం వచ్చాక సంక్షేమం, అభివృద్ధిని గాలికి వదిలేశారని దుయ్యబట్టారు. రైతులకు సకాలంలో ఎరువులు అందక ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. పింఛన్లు, పథకాలు అందక ప్రజలు అవస్థలు పడుతున్నారని చెప్పారు. కార్యక్రమంలో మండల పరిషత్ ప్రత్యేకాహ్వానితుడు మీసాల వెంకటరమణ, జిల్లా అధికార ప్రతినిధి పిల్లల శివకుమార్, కార్యదర్శి పేడాడ శ్రీరామమూర్తి, యువజన విభాగం సభ్యుడు బాలి అప్పలసూరి, వైస్ ఎంపీపీ తోలేటి వెంకటరావు, ఐటీ వింగ్ అధ్యక్షుడు చిత్తిరి మోహన్, నాయకులు చింత సూర్యారావు, ఎర్నేన ప్రకాశరావు, మీసాల రాంబాబు, జనపాల ధనుంజయరావు, బాలబొమ్మ శ్రీనివాసరావు, తోట అప్పలరాజు, టంకాల సత్యనారాయణ, పేడాడ శ్యామలరావు, పేడాడ నారాయణరావు, చిత్తిరి గరికినాయుడు, పేడాడ కృష్ణంరాజు తదితరులు పాల్గొన్నారు.

రాజ్యాంగాన్ని గౌరవించాలి



ప్రసంగిస్తున్న అజశర్మ

శ్రీకాకుళం కల్చరల్: స్వాతంత్ర్యోద్యమ స్ఫూర్తితో రూపొందించిన భారత రాజ్యాంగం అనేక సవాళ్లను ఎదుర్కొని భారత దేశాన్ని లౌకిక ప్రజాస్వామ్య దేశంగా నిలిపిందని ఉత్తరాంధ్ర అభివృద్ధి వేదిక ప్రధాన కార్యదర్శి ఎ.అజశర్మ అన్నారు. జిల్లా కేంద్ర గ్రంథాలయంలో స్వాతంత్ర్య సమరయోధుడు, కవి, వాగ్గేయకారుడు గరిమెళ్ల సత్యనారాయణ, గరిమెళ్ల విజ్ఞాన కేంద్రం వ్యవస్థాపకులు వి.జి.కె.మూర్తి జయంతి సందర్భంగా 'భారత రాజ్యాంగానికి ఎదురవుతున్న తాజా సవాళ్లు' అనే అంశంపై సెమినార్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజ్యాంగాన్ని గౌరవించాల్సిన బాధ్యత అందరిపైనా ఉందన్నారు. కార్యక్రమంలో విశ్రాంత డైట్ కళాశాల ప్రిన్సిపాల్ కొత్తకోట అప్పారావు, పి.సుధాకరరావు, కె.ఎస్.రామకృష్ణ, చింతాడ రామచంద్రరావు, ఎం.ప్రభాకరరావు, జి.సతీష్‌కుమార్, కె.ఎస్.ఎన్.మూర్తి, పి.వి.రమణమూర్తి, జె.భీమశంకరరావు, ఎస్.ప్రకాశరావు, అట్టాడ అప్పలనాయుడు, గొంటి గిరిధర్ తదితరులు పాల్గొన్నారు.

కామాక్షిపీఠంలో సహస్ర నామ పారాయణం



అలంకరణలో కామాక్షిదేవి

శ్రీకాకుళం కల్చరల్: నగరంలోని పాండ్రంగి వీధిలో కామాక్షిదేవి పీఠంలో మంగళవారం కోటి సహస్రనామ పారాయణ నిర్వహించారు. పీఠం నిర్వాహకులు వేదుల సూర్యనారాయణ శర్మ, వెంకటరమణశర్మ నేతృత్వంలో అమ్మవారికి ప్రత్యేక పుజలు నిర్వహించి అనంతరం అలంకరణ చేశారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

తిలక్ సేవలు చిరస్మరణీయం



తిలక్ విగ్రహం వద్ద నివాళులు అర్పిస్తున్న దృశ్యం

శ్రీకాకుళం అర్బన్: స్వాతంత్ర్య కాంక్షకు ప్రతిరూపంగా నీతి, నిజాయితీలకు నిలువుటద్దంగా స్వాతంత్ర్య సమరయోధులు, తొలి పార్లమెంట్ సభ్యుడు కె.ఎస్.తిలక్ నిలుస్తారని గాంధీ మందిర కమిటీ వక్తలు పేర్కొన్నారు.

నగరంలోని శాంతినగర్ కాలనీలో ఉన్న గాంధీ మందిరం, స్వాతంత్ర్య సమరయోధుల స్మృతి వనంలో తిలక్ 105వ జయంతి వేడుకలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో రిటైర్డ్ ప్రొఫెసర్ నిక్కు అప్పన్న, గాంధీ మందిర కమిటీ ప్రతినిధులు డాక్టర్ చింతాడ కృష్ణమోహన్, నటుకుల మోహన్, ఎం.వి.ఎస్.ఎస్.శాస్త్రి, నిష్టల నరసింహమూర్తి, కొంక్యాన వేణుగోపాల్, సువ్వారి రాజారావు, మహిబుల్లాఖాన్, మండవిల్లి గుప్త, నక్క శంకరరావు, పెంకి చైతన్య పాల్గొన్నారు.

పేకాట శిబిరంపై దాడి

శ్రీకాకుళం క్రైమ్: జిల్లాకేంద్రంలోని డే అండ్‌నైట్ సమీప వరం రెసిడెన్సీలో కొంతమంది వ్యక్తులు పేకాట ఆడుతూ పోలీసులకు పట్టుబడ్డారు. రెండో పట్టణ సీఐ ఈశ్వరరావు తెలిపిన వివరాల మేరకు.. ఆదివారం రాత్రి నగరానికి చెందిన నలుగురు వ్యక్తులు వరం రెసిడెన్సీలో పేకాట ఆడుతున్నట్లు టాస్క్‌ఫోర్స్‌కు సమాచారం అందడంతో దాడులు చేశారు. వీరి వద్ద నుంచి 4 మొబైళ్లు, రూ. 9 వేలు నగదు స్వాధీనం చేసుకున్నారు.



ఫాజుల్‌బాగ్ పేటలో భద్రమహంకాళి అమ్మవారు



ముత్యాలమ్మ తల్లి

అమ్మవార్లకు చల్లదనం

ఆషాఢ మాస మంగళవారం సందర్భంగా నగరంలో అమ్మవార్లకు చల్లదనం ఉత్సవాలు నిర్వహించారు. ముత్యాలమ్మతల్లి, మరిడమ్మ, నూకాలమ్మతల్లి, అసిరితల్లి, బండార్లమ్మ అమ్మవార్లకు ప్రత్యేక పూజలు చేశారు. మహిళలు ముర్రాటలతో ఊరేగింపుగా వెళ్లి చల్లదనం చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన కోలాటం, తప్పెటగుళ్లు, కళాకారుల వేషధారణలు అలరించాయి. హౌసింగ్ బోర్డు కాలనీ, దేశల్లవీధి, రెడ్డికవీధి, నక్కవీధి, మంగువారి తోట, ఎల్‌బీఎస్ కాలనీ, రెల్ల వీధి తదితర ప్రాంతాలు ఆధ్యాత్మికతను సంతరించుకున్నాయి. పలు ఊరేగింపులు కాకివీధిలోని ముత్యాలమ్మతల్లి ఆలయం వరకు వచ్చి మొక్కులు తీర్చుకున్నారు. ఫాజుల్‌బాగ్ పేటలోని అసిరితల్లి–భద్ర మహంకాళి అమ్మవారు, పాదాలమ్మతల్లి వార్లకు సైతం ముర్రాట్ల సమర్పించారు.

– శ్రీకాకుళం కల్చరల్



ఆకట్టుకున్న వేషధారణలు



ముత్యాలమ్మతల్లి ఆలయం వద్ద క్యూలో భక్తులు



అసిరితల్లికి ముర్రాట్లు సమర్పణ



హౌసింగ్ బోర్డు కాలనీలో ముత్యాలమ్మతల్లి పూజలు

యువత నైపుణ్యాలను అందిపుచ్చుకోవాలి



మాట్లాడుతున్న డీఎల్‌టీసీ అసిస్టెంట్ డైరెక్టర్ వై.రామమోహనరావు

శ్రీకాకుళం న్యూకాలనీ: యువత చదువుతోపాటు నైపుణ్యాలను అందిపుచ్చుకుని ఉజ్వలమైన భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలని శ్రీకాకుళం డీఎల్‌టీసీ/ఐటీఐ శిక్షణా కేంద్రం అసిస్టెంట్ డైరెక్టర్ యండ రామమోహనరావు అన్నారు. భారత ప్రభుత్వం, యువజన వ్యవహారాలు, క్రీడలు మంత్రిత్వ శాఖకు చెందిన మేరా యువ భారత్ (ఎన్‌వైకె) ఆధ్వర్యంలో శ్రీకాకుళం స్కిల్స్ హబ్ సెమినార్‌హాల్‌లో ప్రపంచ యువ నైపుణ్య దినోత్సవం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏడీ రామమోమహనరావు మాట్లాడుతూ.. ఐక్యరాజ్యసమితి ప్రకటించిన యువ స్కిల్స్ డే ద్వారా యువతకు నైపుణ్యాలు అందించడం, ఉపాధి అవకాశాలను మెరుగుపరచడం, వ్యవస్థాపకతను ప్రోత్సహించడం, యువతను శక్తివంతం చేయడం, భవిష్యత్‌కు మెరుగైన దారి చూపించడం లక్ష్యంగా పెట్టుకున్నామని చెప్పారు. జిల్లా ఉపాధి కల్పనాధికారి కొత్తలంక సుధ, మేరా యువ భారత్ (ఎన్‌వైకె) డిప్యూటీ డైరెక్టర్ కె.వెంకట్ ఉజ్వల్, సెట్‌శ్రీ సీఈఓ వి.వి.అప్పలనాయుడు, సీనియర్ వృత్తి నిపుణులు సిహెచ్.సుబ్బిరెడ్డి యువతతో నేరుగా సంభాషిస్తూ, నైపుణ్యాల ప్రాముఖ్యత, ప్రభుత్వ ఉద్యోగ అవకాశాల నియామకం, తీరుతెన్నులు, స్వయం ఉపాధి అవకాశాలను వివరించారు.

ఆశావహుల జాడేది..?

శ్రీకాకుళం: శ్రీకాకుళం నియోజకవర్గంలో గత వారం రోజుల నుంచి నిర్వహిస్తున్న తొలి అడుగు కార్యక్రమాల్లో నగర అధ్యక్ష పదవి ఆశిస్తున్న వారిలో ఒకరిద్దరు మాత్రమే పాల్గొంటున్నారు. మాదారపు వెంకటేష్ ప్రతిరోజు కార్యక్రమంలో పాల్గొంటుండగా.. కోరాడ హరిగోపాల్, వంగటి వెంకటరమణలు అడపాదడపా పాల్గొంటున్నారు. కాగా పాండ్రంకి శంకర్, ఇప్పిలి తిరుమలరావుల జాడ ఈ కార్యక్రమంలో కనిపించడం లేదు. సోమవారం టీడీపీ జోనల్ ఇన్‌చార్జి పి.శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నప్పటికీ మాదారపు వెంకటేష్, వెంకటరమణలు మాత్రమే వారితో కనిపించారు. నగర పార్టీ అధ్యక్ష స్థానానికి పాండ్రంకి శంకర్, ప్రధాన కార్యదర్శి స్థానానికి ఇప్పిలి తిరుమలరావు పేర్లు దాదాపుగా ఖరారు అయినట్లేనని నాయకులంతా చెబుతుండగా, ఆశావాహుల సైతం ఇదే విషయాన్ని పరోక్షంగా చెబుతున్నారు. ఇటువంటి తరుణంలో చురుగ్గా పాల్గొనాల్సిన ఆ ఇద్దరి నాయకుల జాడ కనిపించకపోవడంపై క్యాడర్‌లోనే విమర్శలు వినిపిస్తున్నాయి. వాస్తవానికి జూన్ చివరి వారంలోనే నగర పార్టీ అధ్యక్షుడి పేరును ప్రకటించాల్సి ఉన్నప్పటికీ, రాష్ట్ర అధినాయకుడి దృష్టికి తీసుకెళ్లి వెల్లడిస్తానని ఎమ్మెల్యే గొండు శంకర్ క్యాడర్‌కు చెబుతూ వచ్చారు. ఈ నెల 4న విజయవాడ వెళ్లడంతో అటు నుంచి వచ్చిన తర్వాత 5వ తేదీన వారి పేర్లను ప్రకటిస్తారని అందరూ భావించారు. అయితే తొలి అడుగు కార్యక్రమంలో పాల్గొంటున్న ఎమ్మెల్యే ఆశావాహులు దుమ్మా కొట్టడాన్ని దృష్టిలో పెట్టుకొని, కార్యక్రమం గడువు పూర్తయిన తర్వాత ప్రకటించాలని భావిస్తున్నట్లు తెలుస్తోంది.

పోలీసులకు వైద్యపరీక్షలు

శ్రీకాకుళం క్రైమ్: పోలీసు సిబ్బంది మాస్టర్ హెల్త్ చెకప్ కార్యక్రమంలో భాగంగా జిల్లాకు పార్వతీపురం మన్యం జిల్లా ఎస్పీ ఎస్.వి.మాధవరెడ్డి మంగళవారం విచ్చేశారు. నగరంలోని మెడికవర్ ఆసుపత్రిని సందర్శించి 50 మంది సిబ్బందికి దగ్గరుండి ఆరోగ్య పరీక్షలు చేయించారు.

సేవలో అవిశ్రాంతంగా..!

- విశ్రాంత ఉద్యోగి కనకరాజు ఔదార్యం
- సాయం కోరే వారికి కాదనకుండా చేయూత
- టెన్త్ విద్యార్థులకు ఫీజుల చెల్లింపు
- 15 ఏళ్లుగా విద్య, వైద్యం, దేవాలయాలకు సాయం

శ్రీకాకుళం కల్చరల్ : సేవకు వయసుతో పని లేదని, తోటి మనిషికి సాయం అందించాలనే గుణం ఉంటే చాలని నిరూపిస్తున్నారు విశ్రాంత ఉద్యోగి, నగరానికి చెందిన ఆరికతోట కనకరాజు. నైర వ్యవసాయ కళాశాలలో ప్రొఫెసర్‌గా పనిచేసిన కనకరాజు వద్దకు ఎవరైనా సాయం కోసం వెళ్తే కాదనకుండా తనవంతు సాయం అందిస్తుంటారు. విద్య, వైద్యం, దేవాలయాల నిర్మాణం.. ఇలా ఏ అవసరం వచ్చినా చేయూతనందిస్తూ స్ఫూర్తిగా నిలుస్తున్నారు. ముఖ్యంగా పదో తరగతి విద్యార్థులకు ఫీజులు చెల్లించడం, పరీక్ష సామగ్రి అందజేయడం వంటి సేవా కార్యక్రమాలు చేస్తుంటారు. కనకరాజు స్వగ్రామం విజయనగరం జిల్లా ఆరికతోట. ఈయన సతీమణి ఉమ వైద్యురాలిగా పనిచేసి రిటైరయ్యారు. వీరు ప్రస్తుతం పాలకొండ రోడ్డులోని ప్రభాకర్‌నగర్ కాలనీలో నివాసముంటున్నారు.



బలగ జ్యోతిబాపూలే హైస్కూల్ విద్యార్థులకు విద్యాకిట్లు పంపిణీ

తల్లిదండ్రుల పేరున ట్రస్టు..

కనకరాజు ఉద్యోగ విరమణ చేశాక 2010లో తల్లిదండ్రులు కూర్మన్న–పోలమ్మాయి పేరిట చారిటబుల్ ట్రస్టు ఏర్పాటు చేశారు. దీని ద్వారా సేవా కార్యక్రమాలు ప్రారంభించారు. ముఖ్యంగా విద్యావసరాలకు, వైద్యం, దేవాలయాలకు రూ.5వేలు నుంచి రూ.10వేలు వరకు సాయం అందిస్తుంటారు.

15 ఏళ్లుగా వలు..

కొత్తసంవత్సరం రోజున దేవాలయాలకు, జ్యోతిషులకు పంచాంగాలు అందించడం, నిత్యాన్నదాన పథకం కోసం వృద్ధాశ్రమాలు, దేవాలయాలకు నగదు సాయం చేయడం, వేసవిలో రిక్షా డ్రైవర్లకు టోపీలు, చలికాలంలో వృద్ధులకు దుప్పట్లు, సంక్రాంతికి పేదలకు నూతన వస్త్రాలు అందిస్తుంటారు. ప్రభుత్వ పాఠశాలలో చదివిన 10వ తరగతి విద్యార్థులకు పరీక్ష ఫీజులు కట్టడం, పరీక్ష కిట్లు (అట్ట పెన్, పెన్సిల్, స్కేల్ తదితరమైన) అందజేస్తుంటారు. 10వ తరగతి, ఇంటర్‌లో 90 శాతం మార్కులు సాధించిన వారికి ప్రతిభా పురస్కారం, ఇంజినీరింగ్ చదువుతున్న బీద విద్యార్థులకు నగదు పురస్కారాలు ప్రదానం చేస్తుంటారు. జ్యోతిబా పూలే హైస్కూల్‌లో 10వ తరగతి విద్యార్థులకు పరీక్ష ఫీజులు చెల్లించి ఆదర్శంగా నిలిచారు. దివ్యాంగులకు మూడు చక్రాల సైకిళ్లకు సాయం, టెక్కలి, రాజాం, తంపటాపల్లి అనాథశరణాలయాలకు ఆర్థిక సాయం అందించారు.



కళాకారుల సమాఖ్యకు సాయం అందిస్తూ..

నాకు తోచిన సాయం..



నిర్భాగ్యులకు నాకు తోచిన సాయం చేస్తుంటాను. పేదవారిని ఆదుకుంటే సంతృప్తి కలుగుతుంది. వారికి కావలసినంత ఇవ్వలేక పోయినా నేను ఇవ్వగలిగినంత సాయం రూ.5 నుంచి రూ.10వేలు వరకు అందిస్తుంటాను.

– ఆరికతోట కనకరాజు, ప్రభాకర్‌నగర్‌కాలనీ, శ్రీకాకుళం



ఖ్యాతి వృద్ధాశ్రమంలో దుప్పట్ల వితరణ